60 ఏళ్లు ఏం చేశారు...?

- కాంగ్రెస్ పాలనలో కనీస సౌకర్యాలు కరువు
- అరవై ఏళ్ల పాటు ప్రజల అవస్థలు
- బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బాలానగర్: రాష్ట్రంలో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన తెలంగాణ గార్డెన్స్‌లో ఫతేనగర్ డివిజన్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 60 ఏళ్ల ప్రజల నీటి కష్టాలను కాంగ్రెస్ పార్టీ ఎందుకు పట్టించుకోలేదన్నారు. గతంలో పీ జనార్దన్‌రెడ్డి వేల మంది మహిళలతో మంచినీటి కోసం ధర్నా చేసిన విషయాన్ని ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంచినీటి సమస్య తీరిందని, కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎప్పటికి మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా 9 రిజర్వాయర్లను నిర్మించుకున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా బాలానగర్ ఫ్లై ఓవర్ నిర్మించుకోవటం జరిగిందని తెలిపారు. భవిష్యత్‌లో ఫతేనగర్‌లో నూతనంగా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కళ్ల ముందు జరుగుతున్న అభివృద్ధి దీనిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కూకట్‌పల్లిలో ప్రతి వీధికి మంచి నీరు, రోడ్లు, నిరంతర విద్యుత్ అందించగలుగుతున్నామని తెలిపారు. ఇదంతా ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతతోనే సాధ్యమైందన్నారు. చిన్నప్పటి నుంచి కూకట్‌పల్లిలో పెరిగి ఇక్కడి ప్రజలతో మమేకమైన వ్యక్తినని తెలిపారు. ఎన్నికల్లో స్థానికులకు టికెట్లు కేటాయించలేని పరిస్థితులు ఇతర పార్టీలకు ఉన్నాయంటే వారి దయనీయ స్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అధిష్టానాలకు ఇక్కడ పనిచేసిన నాయకులు, కార్యకర్తలు కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఢిల్లీలో పైరవీల కారణంగా అట్టడుగు స్థాయి కార్యకర్తలు మనోవేదన చెందుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త అంటే నిబద్ధత కలిగిన కార్యకర్తగా నిలుస్తున్నారన్నారు. మళ్లీ ఇదే అభివృద్ధి కొనసాగాలంటే కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఒక పార్టీ కులాలు, మతాలు మధ్య బేధాలు సృష్టించే పార్టీ అయితే మరో పార్టీలో సీట్ల కోసం కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వారి పబ్బం గడుపుకోవడానికి చేసే జిమ్మిక్కులను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.


కూకట్‌పల్లి ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడంతో మనస్తాపానికి లోనై కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంగళరావుతో చర్చిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి

గరం..గరం చాయ్..

జంగ్ తెలంగాణ 2023

టీ కలిపిన కార్పొరేటర్ ముద్దం



టీ కలుపుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఎన్నికలు రాగానే ఆయా పార్టీల అభ్యర్థులు, పార్టీ నాయకులు ప్రచారంలో తలమునకలవుతారు. ప్రచారంలో రకరకాల పాట్లు పడుతూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తారు. శనివారం ఓల్డ్‌బోయిన్‌పల్లిలో కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావును గెలిపించాలని కోరుతూ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా ఓ టీ స్టాల్ వద్ద ఆగిన ఆయన తానే స్వయంగా అందరికీ టీ పెట్టి మరి అందించారు.

క్లుప్తంగా

మహిళలకు ఉచిత శిక్షణ

మూసాపేట: ప్రశాంత్‌నగర్‌లోని, సోని కాంపెక్స్, రెండో అంతస్తులోని ఎస్ సంజీవరెడ్డి ఫౌండేషన్‌లో నిరుద్యోగ మహిళలకు ఉచిత మగ్గం వర్క్, బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు డా. ఎస్ చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్సు అనంతరం సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు. అర్హులకు ముద్ర బ్యాంక్ నుంచి రుణ సౌకర్యం ఉంటుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఆధార్ కార్డుతో పై చిరునామాలో సంప్రదించాలని కోరారు. నవంబర్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

ఆల్విన్‌కాలనీ: నియోకర్సర్, టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రా పూర్తి బ్యాంకింగ్, ఫైనాన్షియల్ ఇండస్ట్రీపై అవగాహన, సాఫ్ట్ స్కిల్, బేసిక్ ఐటీ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సుల్లో ఉచిత సర్టిఫికేషన్ కోర్సును అందజేస్తున్నామని, గత రెండేళ్లుగా సుమారు 2500 మందికి ఉచిత శిక్షణ ఇచ్చి 500 మందికి వివిధ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. వివరాలకు 7799594242, 7799694242 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

ఐ బొటిక్ ప్రారంభం




గచ్చిబౌలి: ఇప్పటి వరకు మార్కెట్‌లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సందడి చేశాయి, ఇప్పుడు కొత్తగా ఐబొటిక్ లగ్జరీ సన్ గ్లాసెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. హైటెక్‌సిటీ ప్రాంతంలో నిర్వాహకులు డాక్టర్ జగదీశ్‌రెడ్డి, ప్రణతిరెడ్డి, డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో ఈ బొటిక్‌ను సినీ ప్రముఖులు, మోడల్స్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ లగ్జరీ బ్రాండ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

నల్లగండ్ల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.18 లక్షల నష్టం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఆరు షాపులు దగ్ధం అయ్యాయి. సుమారు 18 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు వ్యాపారులు తెలిపారు. తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో మంటలు అంటుకోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు మంటలు రేగకుండా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ అక్కడికి చేరుకొని వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వి. జగదీశ్వర్‌గౌడ్, బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డిలు అక్కడికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఈ ప్రాంతాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, నాయకులు శనివారం పరిశీలించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



భళా.. నృత్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం తాండవ ఆర్ట్స్ కూచిపూడి డ్యాన్స్ అకాడమి గురువు మధుసూదన్ శిష్యబృందం నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. తాండవ నృత్యకారి, శివాష్టకం, భామాకలాపం, జయదేవ అష్టపది, గజవదన బేడువే, శివరంజని, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు అద్వైత, వైష్ణవి, సాత్విక, రిత్విక, శుక్లాచారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

5జీ యూజ్ కేస్ ల్యాబ్ సంబరాలు

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 5జీ యూజ్ కేస్ ల్యాబ్ టాప్-100 సంస్థలలో గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు అవకాశం కల్పించారు. దేశంలోని టాప్-100 ఇన్‌స్టిట్యూట్‌లలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఉండడం విశేషం. దీంతో ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్స్‌కు చెందిన లీడ్ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం 5-జీ యూజ్ కేస్ ల్యాబ్‌పై ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్‌ఎస్‌ఎస్) సెల్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్‌లో క్లీనప్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ సెల్ హెచ్‌సీయూ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో వాలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగాల సహకారంతో చెత్తాచెదారం, ఆకులు, విరిగిపోయిన చెట్లకొమ్మలు, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ఆయా ప్రాంతాలలో శుభ్రం చేశారు. సేకరించిన వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ ద్వారా చెత్త డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ బి కృష్ణయ్య హెచ్‌సీయూను క్లీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్, అరుణ, శ్రీవాణి, సాయిఅఖిల, దివ్య, అన్వేష్, అజయ్‌ప్రకాశ్, వెంకటేష్, మహ్మద్ జునైద్, అభిలాష్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

వెంకట్‌రావు ప్యానల్ ఘన విజయం

ముగిసిన భెల్ ఎంఐజీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. భెల్ ఎంఐజీ కాలనీలో నిర్వహించిన పోలింగ్‌లో పి వెంకట్‌రావు(ఎంఎల్‌ఏ) ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఈ సొసైటీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ కేటగిరి ఒక పోస్టుకు జరిగిన పోటీలో చింతా రాములు కమిటీ సభ్యుడుగా 140 ఓట్లు సాధించి విజయం సాధించారు. జనరల్ కేటగిరిలో 9 మంది పోటీ పడగా నలుగురు విజయం సాధించారు. వారిలో పి వెంకట్‌రావు(ఎంఎల్‌ఏ) 108 ఓట్లు, కెవిసుబ్బారావు 104 ఓట్లు, ఎస్ నారాయణ 101 ఓట్లు, ఎం నీలకంఠరావు 97 ఓట్లు సాధించారు. కాగా నీలకంఠరావు, బాలయ్య ఇద్దరికీ 97 ఓట్లు సమానంగా రావడంతో టాస్ వేయగా విజయం నీలకంఠరావును వరించింది. అనంతరం కాలనీవాసులు విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉల్లాసంగా సైకిల్‌రైడ్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ బైసైక్లింగ్ స్టేషన్ నుంచి వీకెండ్ రైడ్ శనివారం ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైంది. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ టీమ్ ఆధ్వర్యంలో హెచ్‌బీసీ బైసైక్లింగ్ స్టేషన్ నుంచి 30 కిలోమీటర్ల సైకిల్‌రైడ్‌ను గండిపేట్ వరకు నిర్వహించారు. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ వీకెండ్‌లో సైక్లింగ్ ఉంటుందని, ఔత్సాహికులంతా పాల్గొనాలని సూచించారు. హెచ్‌బీసీ బైసైక్లింగ్ స్టేషన్ వద్ద ప్రారంభమైన సైకిల్ రైడ్ బయోడైవర్శిటీ పార్కు కూడలి, సైబరాబాద్ కమిషనరేట్, గచ్చిబౌలి కూడలి, ట్రిపుల్‌ఐటీ కూడలి, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మీదుగా విప్రో సర్కిల్, కోకాపేట్ గండిపేట్, ఓఆర్‌ఆర్ సైక్లింగ్ ట్రాక్ మీదుగా పుప్పాలగూడ వరకు నిర్వహించి అదేమార్గంలో తిరిగి హెచ్‌బీసీ సైక్లింగ్ స్టేషన్ వరకు రైడ్ నిర్వహించారు.



కృష్ణారావుతోనే నియోజకవర్గ అభివృద్ధి


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావును భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు మద్దతుగా ఆయన భవానీ నగర్, ఎల్బీ నగర్, టీచర్స్ కాలనీల్లో ప్రచారం చేశారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేయాలనుకునే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, మక్కల నర్సింగ్‌రావు, కర్రె లావణ్య, ఎజాజ్, ఇర్ఫాన్, హరినాథ్, వాసు యాదవ్, యాదగిరి, ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన చున్నూ పాషా


మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన చున్నూ పాషా

మూసాపేట: మూసాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చున్నూ పాషా శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చున్నూ పాషా మాట్లాడుతూ 1994లో పీజేఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. 15 ఏళ్లుగా మూసాపేట డివిజన్ అధ్యక్షుడిగా, ఐదేళ్ల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశానని, పార్టీ ఇచ్చిన ఏ కార్యక్రమంలోనైనా చురుగ్గా పాల్గొన్నట్లు తెలిపారు. అయినా ఆ పార్టీలో కార్యకర్తలకు తగిన గుర్తింపు లేదని, పార్టీని నమ్ముకుని సేవ చేసిన కార్యకర్తలకు కాకుండా బయటి వ్యక్తులకు టికెట్ ఇవ్వడంతో పార్టీ మారినట్లు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎంతో అభివృద్ధి చేశారని, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించారని కొనియాడారు. స్థానిక నాయకుడు, ఎప్పుడు అందుబాటులో ఉండే మాధవరం కృష్ణారావును గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటు..అభివృద్ధికి చోటు

కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు


కేపీహెచ్‌బీ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించుకుని నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన 5వ ఫేజ్ ఎన్‌ఎస్‌ఐ నార్త్ బ్లాక్ ప్రాంతంలో ఇంటింటికి తిరుగుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మాధవరం కృష్ణారావుల సహకారంతో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే కృష్ణారావు ప్రజలకు ఏ లోటు లేకుండా చూసుకున్నారని, సమస్య ఉందని చెప్పగానే వెంటనే స్పందించి తగిన నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తారన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బంది లేకుండా భూగర్భ నీటి లైన్ నిర్మాణాలు, రోడ్లు, 24 గంటల విద్యుత్, బస్తీ దవాఖానాలు, పార్కులు, ఇండోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మరోసారి ఓటు వేసి భవిష్యత్‌లో మరింత అభివృద్ధికి నాంది పలుకుదామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సురేష్ రెడ్డి, సాయిబాబా చౌదరి, కట్టా నర్సింగరావు, 5వ ఫేజు నార్త్ బ్లాక్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: ఉచిత వైద్య శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్‌కాలనీలో కల్వరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసర ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తూ ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాలు పరిసర ప్రాంత వాసులు వినియోగించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో జనరల్, స్త్రీల, చిన్న పిల్లల, ఎముకల, చర్మ, నేత్ర సంబంధిత వైద్యులు చికిత్సలు అందించటంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 18రకాల రక్తపరీక్షలు, బీపీ, షుగర్, గైనకాలజీ, ఆర్థో,ఈసీజీ,ఈఎన్‌టి, దంత, కంటి పరీక్షలు చేశారు. అర్హులైన వారికి ఉచిత కళ్లజోళ్లను అందించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, అబుల్, కృష్ణ, ఖయ్యూమ్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెటిలర్స్‌కు అండగా ఉంటా

ములుగు ఎమ్మెల్యే సీతక్క

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో నివాసం ఉంటున్న సెటిలర్లకు అండగా ఉంటానని ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం రాత్రి ఆమె ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. భాగ్యనగర్‌కాలనీకి చెందిన నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతూ ఆమె నియోజకవర్గంలోని ఆయా సామాజికవర్గానికి చెందిన కుటుంబాలను సీతక్కకు మద్దతు ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. మియాపూర్, హైదర్‌నగర్, వివేకానందనగర్ డివిజన్‌ల పరిధిలోని పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో నివాసముండే సెటిలర్స్ అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

'మాధవరం'ను లక్ష మెజార్టీతో గెలిపిస్తాం..

కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మూడోసారి లక్ష మెజారిటీతో గెలిపిస్తామని కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని పుల్లబస్తీ, ప్రకాశం నగర్, హెచ్ఏఎల్‌కాలనీ, సాయిబాబా కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వాసుదేవరావు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీ సెల్ బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.


కూకట్‌పల్లి డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు

ఆరెకపూడిని అఖండ మెజార్టీతో గెలిపిద్దాం..

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


వెంకట పాపయ్య నగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాయయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యే గాంధీ తోడ్పాటుతో ఆల్విన్‌కాలనీ డివిజన్, వెంకట పాపయ్యనగర్ కాలనీలో అన్ని విధాల అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి లారెకపూడి గాంధీని మూడోసారి గెలిపించుకోవటానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాద్ యాదవ్, శివరాజ్ గౌడ్, బోయ కిషన్, అంజయ్య యాదవ్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాందాస్ గౌడ్, మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.